ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- భీమడోలులో కొత్త పింఛన్ల పంపిణీ

భీమడోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నవరత్నాల పథకాల అమలుతో ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు ఎంపీపీ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 548 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పింఛన్ కోసం ఎవరి దగ్గరికి వెళ్లి చేతులు కట్టుకునే అవసరం లేకుండా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చే అద్భుతమైన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వంలో ఇదే ఫించన్ల కోసం పంచాయతీల చుట్టూ తిరిగేవారని, నేడు ఆ పరిస్థితి లేదని వలంటీర్ తెల్లవారేలోపే ఫించన్ల నగదును అందిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలకు ఇతోధికంగా నిధులు వెచ్చిస్తుందని, విద్యకు వెచ్చిస్తున్న నిధులతో మన పిల్లలు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. ఇప్పటికే మన పిల్లలు దేశ విదేశాలల్లో తమ వాణిని వినిపిస్తూ ఔరా అనిపించుకుంటున్నారన్నారు. అర్హతఉంటే కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా పథకాల లబ్ధి అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరా గాంధీ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జిల్లా పార్టీ కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు తుమ్మగుంట రంగ, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



భీమడోలులో కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

క్లుప్తంగా

మట్టిగణపతి ప్రతిమలే మేలు



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: మట్టి ప్రతిమలను వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వెలుగు సంస్థ ఆధ్వర్యంలో తయారుచేసిన మట్టి విగ్రహాలను ఎమ్మెల్యే వాసుబాబు చేతులమీదుగా ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సంస్థ నిర్వాహకుడు, ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ పెనుగొండ సూర్యచంద్రరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు-2 ఎంపీటీసీ నందక రాంబాబు, పుప్పాలగోపి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా విజిలెన్స్ ఫుడ్ కమిటీ సభ్యుడిగా కోనే



కోనే సత్యనారాయణ

ఉంగుటూరు: ఏలూరు జిల్లా విజిలెన్స్ ఫుడ్ కమిటీ సభ్యుడిగా కైకరం గ్రామానికి చెందిన కోనే వీర వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు దశాబ్దాలుగా వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఆయన సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దివ్యాంగ మహాసంఘటన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నేషనల్ ట్రస్టు యాక్టు లోకల్ కమిటీ సభ్యుడిగా, మానవత సంస్థ సభ్యుడిగా కోనే సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం



భీమడోలులో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాలు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు సోపానాలన్నారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, కె.సత్యనారాయణ, మోహనరావు పాల్గొన్నారు.

22న రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు (టూటౌన్): పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ ఈ నెల 22న వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు తెలిపారు. అదేరోజు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆదివారం సాయంత్రం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆఫీసులో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, పళ్ళెం కిషోర్, బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

హైందవ సంస్కృతిని ప్రతి ఒక్కరూ కాపాడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వారసత్వ సంపదగా వచ్చిన పండగలు, ఉత్సవాల నిర్వహణ ద్వారా హైందవ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని అన్నారు. ఆదివారం ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో జ్వాలా పహారేశ్వర స్వామి చిల్లర కూరగాయల వర్తక సంఘం నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు వర్తక సంఘం నాయకులు ఆళ్ల నానిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆహ్వాన పత్రికను ఆళ్లనానికి అందించారు. ఈ సందర్భంగా ఆళ్ళ నాని మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే చాలా గొప్పదని, విదేశీయులు సైతం ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొద్దపు గోవిందు, కోలా భాస్కరరావు, అగ్రహారపు శివ, కర్రా చిన్న, బోండా రాజా, తుంపాల గంగాధరరావు, పొలిమేర రాజు, ఏ. ప్రసాదు, మొండెపు లక్ష్మణ, పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పేకాటపై దాడి నిర్వహించి, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్‌లోని ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,700, 5 సెల్‌ఫోన్‌లు, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మవారు

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మ విశేష పూజలందుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయంతో రూ.25,850, విరాళాల ద్వారా రూ.3,559, లడ్డూ ప్రసాదంపై రూ.5,400, ఫొటోల వల్ల రూ.1,600 ఆదాయం లభించగా మొత్తం రూ.36,409 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పరిశీలన



కురెళ్లగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న ఆర్డీవో ఖాజావలి

భీమడోలు: అర్హులకు ఓటు హక్కు కల్పించడం మన బాధ్యత అని, ఎన్నికల సంఘం నిబంధనలను అతిక్రమించి అనర్హులకు ఓటు హక్కు కల్పిస్తే శాఖాపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఏలూరు ఆర్డీవో ఎస్‌కే ఖాజావలి హెచ్చరించారు. కురెళ్లగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం పైకప్పు, మంచినీరు, విద్యుత్ సదుపాయం, ఓటర్లకు ర్యాంపు, ప్రహరీ గోడ, ఫర్నిచర్, మొబైల్ కనెక్షన్, ఇంటర్నెట్ సౌకర్యం తదితర వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో సున్నా డోర్ నెంబర్లు, ఒకే డోర్ నెంబర్‌లో 10కి మించిన ఓటర్లు, మృతి చెందిన వారి పేర్లు, కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాకే తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, వీఆర్వోలు ఇంతియాప్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన



జానంపేటలో ఓటర్ల జాబితాపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు

పెదవేగి : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్ల జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పెదవేగి తహసీల్దార్ ఎన్.నాగరాజు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో డోర్ నంబర్-0 గా నమోదైన ఓటర్లకు వారి వద్ద నుంచి సంబంధిత జెరాక్స్ కాపీలను తీసుకొని వారికి ఫారం 8 నమోదు చేస్తామని నాగరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ సుడిగాలి పర్యటన చేశారు. ఒక పోలింగ్ కేంద్రంలో ఒకే డోర్ నంబరుతో 10 కన్నా ఎక్కువ ఓట్లు ఉన్న ఓటర్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వారి వద్ద నుంచి ఆధార్ కార్డు, ఇంటి పన్ను రసీదులను తీసుకొని వాటిని ఫారం 8 ద్వారా సరియైన డోర్ నంబరుకు మార్పు చేస్తున్నామని తహసీల్దార్ అన్నారు. ఓటరు మరణిస్తే ఫారం 7 నమోదు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో దెందులూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ సత్యనారాయణ, మండల తహసీల్దారు యన్. నాగరాజు, ఎంపీడీఓ రాజ్ మనోజ్, సూపర్ వైజర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పోతునూరు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

దెందులూరు: దెందులూరు మండలం పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణారావు అన్నారు. అండర్-17 బాలుర విభాగంలో రాఘవేంద్ర, వీ.తంబి, బాబు, అండర్-17 బాలికల విభాగంలో ఎస్.లావణ్య, డీ.లాస్య, ఎన్. సులోచన ఎంపికయ్యారన్నారు. ఈ నెల 21 నుంచి విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీదారులను హెచ్‌ఎం. మధుసూదనరావు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జి), ఎంపీటీసీ సున్నా నరేష్, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ రమేష్ అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి



భీమడోలులో ఉత్సవ కమిటీల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్సై సురేష్‌కుమార్

భీమడోలు: ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్సై చావా సురేష్‌కుమార్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిటీ సభ్యులకు ఆదివారం భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. వినాయక చవితి పండుగను ఆధ్యాత్మిక చింతనతో జరుపుకోవాలన్నారు. ఎటువంటి గొడవలకు, కొట్లాటలకు తావివ్వరాదన్నారు. అసభ్యత, అశ్లీలత లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలో ఉత్సవ కమిటీ సభ్యులకు నిడమర్రు సీఐ సుభాష్, ఎస్సై స్వామి ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా చవితి వేడుకలు జరుపుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్లనాని



జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనానిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు తదితరులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఇలాంటి సంక్షేమ పాలన ఏనాడూ చూడలేదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ళనాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు క్లస్టర్ అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నేతలు ఎమ్మెల్యే ఆళ్ళనానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గం క్లస్టర్ -1 అధ్యక్షులుగా కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, క్లస్టర్-2 అధ్యక్షుడిగా డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, క్లస్టర్-3 అధ్యక్షుడిగా మాజీ ఏఎంసీ చైర్మన్, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు నియమితులయ్యారు. వీరంతా ఎమ్మెల్యే నానిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అధికారం కోసం అర్రులు చాస్తున్న ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న రాజకీయ కుట్రలు, అసత్య ప్రచారాలను దీటుగా తిప్పికొట్టేందుకు సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో చేసిన మేలును వివరించాలన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడినా టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, న్యాయమూర్తి తీర్పును సైతం తప్పుబడుతూ ఆరోపణలు చేయటం వారిలోని నీచమైన సంస్కృతికి నిదర్శనం అన్నారు. ఏలూరు నియోజకవర్గంలో సీఎం జగన్ పాలనలో ఏమి అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించాలని జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఆళ్ళనాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం

పెదవేగి : చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం చదవడం-మాకిష్టం అని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు విద్యార్థులతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవితంలో చక్కగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారి జీవిత చరిత్రలను చిన్నారులకు అరుణ్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులతో పలురకాల పుస్తకాలను చదివించారు.

వైఎస్సార్ సీపీకే కాపుల మద్దతు

దెందులూరు: రాష్ట్రంలో కాపులంతా వైఎస్సార్ సీపీతోనే ఉంటారని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకంతో పాటు కాపునేస్తం గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు, దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన దెందులూరులో మాట్లాడుతూ రాష్ట్రంలో కాపుల అభివృద్ధి, స్వయం ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో గతంలో ఎన్నడూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను వైఎస్సార్ సీపీని కాపులంతా ఆశీర్వదిస్తారన్నారు. నాల్గవ విడత కాపునేస్తం పథకం లబ్ధిదారులకు నగదును లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు జమ చేసినందుకు కాపు సంఘం తరఫున ఆయన కృతజ్ఞతలుతెలిపారు.

గ్రామాల్లో చవితి శోభ

పెదవేగి : పల్లెలు గణపతి నవరాత్రుల శోభతో కలకల్లాడుతున్నాయి. వినాయక చవితి పురస్కరించుకుని దాదాపు అన్ని గ్రామాల్లో పందిళ్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాల నిర్వాహకులు గణేశ్ విగ్రహాలను కొనుగోలు చేసి ఊరేగింపుగా తీసుకువచ్చారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో మందిరాలను అలంకరించేందుకు పెదవేగి పరిసర పల్లె గ్రామాల నుంచి కొబ్బరి కాయలు, ఆకులు, మామిడి ఆకులు తదితర పత్రిని సేకరించి తరలిస్తున్నారు. రద్దీని సైతం భక్తులు లెక్కచేయకుండా చవితికి పూజాసామగ్రి, వినాయక ప్రతిమలను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



భీమడోలులో హోమ పూజల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, అర్చకులు



కైకరంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

భీమడోలు: శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సతీష్ శర్మ, ధనుంజయచారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు చేశారు. గాళ్ల రాజారావు, రమణ దంపతులతో హోమ పూజా కార్యక్రమాలను జరిపారు. తొలుత విఘ్నేశ్వర పూజ, శ్రీవిశ్వకర్మ పతాకావిష్కరణ, పుణ్యాహవచనము, అంకురార్పణ, శ్రీగాయత్రీ విశ్వకర్మ పూజ, విశ్వకర్మ యజ్ఞం, శాంతిహోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, రావిపాటి గాంధీలతో పాలు ప్రముఖులు పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చల్లగాలి వెంకటేశ్వరరావు, గ్రామ సంఘం అధ్యక్షుడు గాళ్ల సీతారామచంద్ర రాజారావు, పెద్దలు కంచారపు తిరుమంగాచారి, ముల్లేటి అప్పలాచారి, కందాల ఆచార్యులు, కంచిరాల మీనాచార్యులు, యర్రంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కైకరంలో విశ్వకర్మ జయంతి

ఉంగుటూరు: కైకరంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. విశ్వకర్మ విశిష్టత గురించి వక్తలు వివరించారు. సంఘం అధ్యక్షుడు యర్రోజు సబ్బయ్య, కార్యదర్శి వీర్రాజు, గన్నాబత్తుల దేశముఖ్, గురజాపు సురేష్‌కుమార్, గనుమోజు వెంకటరమణ, కోటేశ్వరరావు, మార్రోజు భాస్కరరావు, సాగిక శర్మ పాల్గొన్నారు. నారాయణపురంలో ఎంపీటీసీ బండారు నాగరాజు ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మంద్ర స్వామివారి చిత్రపటానికి పూజలు చేశారు. బళ్ల త్రిమూర్తులు, గంగాధర్, మతుకుమిల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

ఉంగుటూరు: బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో బొమ్మిడి గ్రామంలోని పావని దుర్గదేవి ఆలయంలోను, ఉప్పాకపాడు శివాలయంలో పూజలు జరిపారు. ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కాకిలేటి వెంకటేశ్వరరావు, పార్టీ ఉంగుటూరు మండల అధ్యక్షుడు వంజరపు దుర్గరావు, మండల ప్రధానకార్యదర్శి నూకల రోహిత్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యా వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపవరం బస్టాండువద్ద ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నంద్యాల రామలింగరాజు, ఇందుకూరి అశోకచక్రవర్తి పాల్గొన్నారు.

సామాజిక న్యాయ పోరాట యోధుడు పెరియార్

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయ పోరాట యోధుడు, సనాతన ధర్మం నిర్మూలనకు నిరంతరం పోరాడిన పెరియార్ రామస్వామి నాయకర్ 144వ జయంతిని ఏలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ పెరియార్ గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. వేల్పుల ప్రతిభ, బొల్లారపు నాగరాజు పాల్గొన్నారు.

కప్పల ఊరేగింపు



రాళ్లకుంటలో కప్పలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ద్వారకాతిరుమల: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని రాళ్లకుంటలో ఆదివారం కప్పలను ఊరేగించారు. ముందుగా గ్రామస్తులు కప్పలకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఒక కర్రకు మామిడి ఆకులు, గుడ్డను కట్టి, అందులో కప్పలను ఉంచి, డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహిళలు బూర్గులమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి పూజలు, జలాభిషేకాన్ని నిర్వహించారు. ఆ తరువాత వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకుని, కప్పలను ఆలయం పక్కనున్న చెరువులో విడిచిపెట్టారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు నగరమేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు సూచించారు. తెనాలి డబుల్ హార్స్ సంస్థ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ ప్రతినిధి దుర్గ సత్యవతి ఆదివారం మేయర్ దంపతులను కలిసి వారికి మట్టి గణపతి ప్రతిమలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీహెచ్ సంస్థ మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామమన్నారు.

విద్యతోనే ఆర్థిక, సామాజికాభివృద్ధి

ఏలూరు టౌన్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఏలూరు నగర తూర్పుకాపు పరిరక్షణ కమిటీ చైర్మన్, సంఘ పెద్దలు బంకా ప్రసాద్ అన్నారు. ఏలూరు నగర తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం అధ్యక్షుడు లంక వెంకట రామ్మోహనరావు అధ్యక్షతన తూర్పు కాపు పేద విద్యార్థులు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. తూర్పుకాపుల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ పూర్తిచేసి సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ తుమరాడ మనోజ్, డాక్టర్ తుమరాడ ప్రశాంత్, డాక్టర్ ఎక్కడు రమాకాంత్, డాక్టర్ బౌరోతు మాన్విత, డాక్టర్ పిన్నింటి పూజా మహేశ్వరిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సంఘం నగర కార్యదర్శి అలజంగి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పిన్నింటి మహేష్, గౌరవాధ్యక్షుడు మజ్జి కాంతారావు, సామంతుల లక్ష్మణరావు, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, కార్పొరేటర్ కత్తిరి రామ్మోహనరావు, రంగబాబు, ఏఎంసీ డైరెక్టర్ సానుపల్లి యుగంధర్‌ప్రసాద్, డోల గురుమూర్తి, బంకా రామ్మోహనరావు, బౌరోతు బాలాజీ, గొర్ల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్‌గా జేఎస్ శ్రీనివాస్ నియామకమయ్యారు. శనివా రం ఆయన ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆయన అమలాపురం తహసీల్దార్ కార్యాలయంలో అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొద్ది నెలల క్రితం ఏలూరు మండలాన్ని ఏలూ రు, ఏలూరు రూరల్‌గా విభజించిన సంగతి తెలిసిందే. ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి తహసీల్దార్‌గా సోమశేఖర్, చాటపర్రు కేంద్రంగా ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ పని చేయనున్నారు. సిబ్బందిని నియమించే వరకూ శ్రీనివాస్ ఏలూరు తహసీల్దార్ కార్యాలయం నుంచే సేవలందించనున్నారు.



